BHAVAVEENA
Vol. 16, Issue. 7(2), July - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# ఎరుకుల - విభిన్న వృత్తులు

- డా॥ గరికపాటి హరిబాబు, లెక్చరర్, తెలుగుశాఖ, యస్.జి.వి.ఓరియంటల్ కళాశాల, తిమ్మసముద్రం, ప్రకాశం జిల్లా.

ఆటవిక జాతిగా జీవన విధానాన్ని సాగిస్తూ గిరిజనులుగా గుర్తింపబడిన ఎరుకుల జాతివారు పురాణకాలం నుండి చరిత్ర కలిగి జీవిస్తున్న జాతి అని మనం గ్రహించాలి. భారతదేశ మానవులంతా కులం పునాదుల మీద నిర్మితమైనవారుగా చదువుకుంటున్నాం. ఒక్కొక్క కులానికి ఒక్కొక్క వృత్తి ఉంది, కాని ఎరుకుల జాతికి మాత్రం వైవిధ్య భరితమైన నైపుణ్యం కలిగిన వృత్తులు ఉన్నవని తెలియచేయటం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం. "ఈ దేశంలో అనేక వృత్తులనుండి కులాలు పుట్టినవి, కాని ఎరుకుల కులంనుండి వృత్తులు పుట్టినవి అనే విషయాన్ని తెలియ చేయవలసిన అవసరం ఉంది.

## ముఖ్యాంశాలు :

సోది అనేది ఎరుకుల జాతి మహిళలు చెబుతారు. పల్లికలు అడుగు మట్టులు మహిళలు వేస్తారు. కుంచెలు కట్టడం, పందుల పెంపకం, అల్లికలు, సవరాలు కట్టడం, జానపద వైద్యం, ఎరుకుల కులం నుండి విభిన్న వృత్తి నైపుణ్యాలు పుట్టినవి.

భారతదేశం అనేక కులాలు, మతాలు, సంప్రదాయాలు, నమ్మకాలు కలిగిన ప్రజల కూటమి. లౌకిక వాదంతో జీవిస్తూ ప్రజాస్వామ్యంతో విరాజిల్లుతున్న చక్కటి దేశం. ఈ దేశంలో ఉన్న కులాలను, వారి వృత్తులను పరిశీలిస్తే ఆయా ప్రజల జీవన వైరుధ్యాలు అనేకం మనకు దర్శనమిస్తాయి. "ప్రతీ కులం కూడా వారు చేసే పని నుండి పుట్టినట్లు మనం గ్రహించవచ్చు". అనగా! వృత్తి నుండి కులం పుట్టింది. గిరిజన తెగల్లో ఒకరైన ఎరుకుల వారిని పరిశీలిస్తే పైన పేర్కొన్న సూత్రం ఎరుకుల వారికి పొసగదని చెప్పవచ్చు. ఎరుకుల కులం మాత్రం వృత్తినుండి పుట్టలేదు. "కులం నుండే వృత్తి పుట్టింది". ప్రతీ కులానికి ఒక వృత్తి ఉన్నదని తెలుసుకున్నాం, కాని ఎరుకు వారికి అనేక రకాల నైపుణ్యాలు ఉండటంచేత, వృత్తులు కూడా అనేకం ఉన్నాయి.

"ఎరుకుల" అనే పదం 'ఎరుక' నుండి వచ్చింది. 'ఎరుక' అంటే జ్ఞానం, భవిష్యత్ తెలిసి ఉండటం అని అర్థాలు, ఎరుకులవారు 'ఎరుక' చెబుతారు. భవిష్యత్ గురించి చెప్పడానికి ప్రకృతి పట్ల జ్ఞానం కలిగి ఉండాలి. గ్రహాల పట్ల అవగాహన ఉండాలి, అప్పుడే ఎరుక చెప్పగలరు. అందువల్ల ఎరుకుల వారిని జ్ఞానవంతులుగా చెప్పవచ్చు. "YERUKULA" comes from the tamil word arital which means **"Knowing"** "The name yerukula is derived from YERUKA meaning prophesy in Telugu. Since the women of this tribe are **'sooth sayers'** and **'fortune-tellers'** (K.S.Singh - Page 1982, 2003).

## ఎరుకుల వృత్తులు :

ఎరుకుల వృత్తులు అనేకం ఉన్నాయి. వీరి వృత్తి పనుల్లో శాస్త్రీయత నెలకొని ఉంది. దానికన్నా ముందు జానపద విజ్ఞానం దాగి ఉంది. ఎరుకుల వారు చేసే ప్రతి పనిలోనూ జానపద విషయాలు కనిపిస్తాయి. భారతదేశంలో 6,400 కులాలు ఉన్నాయి. ప్రతి కులానికి ఏదో ఒక వృత్తి, తమదైన సంస్కృతి, సంప్రదాయాలున్నాయి. ఈ దేశంలో ముందుగా కులాలు పుట్టలేదని వృత్తులు పుట్టాయని, వృత్తుల నుండి కులాలు పుట్టాయని పురాణాలు, ఇతిహాసాలు, చరిత్రలు చెబుతున్నాయి.

"ఎరుకుల కులం మాత్రం వృత్తినుండి పుట్టలేదు. కులం నుండి వృత్తి పుట్టింది ". ఎరుకుల చరిత్ర కొన్ని వేల సంవత్సరాల చరిత్ర. వీరి జీవన విధానాలు, సంస్కృతులు, సంప్రదాయాలు, భాష, వేరుగా ఉన్నాయి. ఈ జాతి చేతి నుండి, ఆలోచనా శక్తినుండి కొన్ని వృత్తులు, అనగా చేతి పనులు పురుడు పోసుకుని, ముఖ్యంగా జానపద జీవన విధానంలో ఎనలేని స్థానాన్ని పొందాయి.

BHAVAVEENA
Vol. 18, Issue. 12, December (2) 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# భర్తృహరి సుభాషితాలు – కార్యసాధన

## (THE WAY OF ACHIEVEMENT)

- డా॥. గరికపాటి తాలిబాబు, లెక్చరర్, తెలుగుశాఖ, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల, రావులపాలెం, తూర్పుగోదావరి.

ఈ భూమ్మీద కోట్లమంది పుడుతున్నారు, చస్తున్నారు. పుట్టలో చెదపురుగులు మాదిరి. మానవులుగా పుట్టి నందుకు తమ జీవితాలను సార్ధకం చేసుకొనేవారు అతి తక్కువ మంది. దీనికి కారణం ఏ లక్ష్యంలేని జీవన గమనం. లక్ష్యం ఉన్నా కృషిలేకపోవటం. సమాజంలో చదువులేని వారుకూడా తమ జీవితంలో అనేక విషయాల్లో సార్ధకత పొందుతారు. లక్ష్యసాధనలు అనేవి వ్యక్తిగతం, సమాజగతం అది రెండు విధాలుగా ఉంటాయి. చదువు కున్న వారి లక్ష్యసాధనలు ఎక్కువగా సమాజగతమై ఉంటాయి. అందువల్లనే అక్షరాస్యత ఎంత ఎక్కువగా ఉంటే సమాజం అంత అభివృద్ధి చెందుతుంది. విద్యావేత్తల ద్వారానే Innovations జరుగుతాయి. విద్య ద్వారా మనిషిలో అన్వేషణా జిజ్ఞాస ప్రారభమవుతుంది. అందువల్ల మానవవులు విద్యనభ్యసించటం సమాజానికి చాలా అవసరం.

ఆధునిక సమాజంలో విద్యనభ్యసించే విద్యార్ధులలో సింహభాగం విద్యార్ధులకు ఎలాంటి లక్ష్యాలు లేనివారు న్నారు. డిగ్రీ చదువుతున్న విద్యార్ధుల్లో కూడా ఎలాంటి లక్ష్యాలు లేకపోవటం సోచనీయం. ఇది చాలా బాధాకర మైన విషయంగా సమాజం భావించాలి. గమ్యంలేని సముద్ర ప్రయాణంలా-నేటి విద్యార్ధుల విద్యా గమనం ఉంది. ఇలాంటి విద్యార్ధులవల్ల సమాజానికి నష్టమే కాని లాభం లేదు. ఇది తల్లిదండ్రుల అజ్ఞానమా? విద్యార్ధుల నిర్లక్ష్యమా? లేక ఉపాధ్యాయుల చేతగాని తనమా? అని ఆలోచన చేయాలి. డిగ్రీ చదివిన విద్యార్ధులు యూని వర్శిటీ విద్యనభ్యసించె సంకల్పం లేకపోతే పరిశోధనాభి వృద్ధి కుంటుపడుతుంది. పరిశోధనలతోనే కదా ప్రగతి సాధన చేకూరేది. అందువల్ల ప్రతి విద్యార్ధికి ఒక లక్ష్యం ఉండేవిధంగా, ఒక స్థిరమైన 'Goal' ని వారి మనస్సులో నాటుకొనే విధంగా, స్కూల్ వయస్సులోనే చెయ్యాల్సిన బాధ్యత గురువులపైన ఉంది.

కార్యసాధన గురించి భర్తృహరి సుభాషితాల్లో అనేక పద్యాలున్నాయి. ఇలాంటి పద్యాల్ని చిన్న వయస్సులోనే విద్యార్ధుల మనస్సుల్లో చొప్పించాలి.

"ఒకచో నేలను బవ్వళించు, నొకచో నొప్పారు
బూసెజ్జపై,
నొకచో శాకము లారగించు, నొకచో నుత్కృష్ట
శాల్యోదనం,
బొకచో బొంత ధరించు, నొక్కొకతరిన్ యోగ్యాం
బరశ్రేణి, లె
క్కకు రానీయడు కార్యసాధకుడు దుఃఖంబున్
సుఖంబున్ మదిన్"

భావం :

కార్య సాధకుడు అవసరమైతే కొన్నిసార్లు నేలమీద పడుకుంటాడు. తనకు లభిస్తే పూల పాన్పుమీద శయనిస్తాడు. దొరికితే పంచభక్ష్య పదార్ధాలను భుజిస్తాడు, దొరక్కపోతే కందమూలాలతో ఆకలి తీర్చుకుంటాడు. లభిస్తే పట్టువస్త్రాలు ధరిస్తాడు లేకుంటే గోనెపట్టాలు చుట్టుకుంటాడు. కష్టాలైనా సుఖాలైనా లెక్కచేయకుండా ముందుకు సాగుతాడు.

ఒక లక్ష్యాన్ని సాధించాలనుకునే వ్యక్తికి కష్టసుఖాల బేరిజు ఉండదు. తన ఆలోచన, దృష్టి అంతా గమ్యం మీదనే ఉంటుంది. ఏ లక్ష్యం లేకపోయినా ప్రతి మనిషి జీవితంలో కొంతకాలం సుఖాలు, కొంతకాలం కష్టాలు, కొన్నిసార్లు ఆనందం, కొన్నిసార్లు దుఃఖం సహజం.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(1), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# సత్యహరిశ్చంద్ర నాటకం - ఆస్థి అశాశ్వితం

- డా॥ గరికపాటి లీలాబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్, యస్.జి.వి. ఓరియంటల్ కళాశాల, తిమ్మసముద్రం, ప్రకాశం జిల్లా.

ఆస్థి లేనిదే అన్నంలేని సమాజం ఇది. మనిషి బ్రతకడానికి ఆహారం అవసరం. మానవునికి సిగ్గు, మానం, అభిమానం ఉన్నవి కనుక ధరించడానికి వస్త్రాలు కూడా చాలా అవసరం. నివసించడానికి గూడు కూడా అవసరం. ఆదిమ జాతిగా మానవుడు ఉన్నప్పుడు మానవునికి ఈ మూడే అవసరాలు ఉండేవి. కాని నేటి నవ నాగరిక మానవుడికి కావలసినవి "అనంతం" ఈ సృష్టిలో లేనివి కూడా అవసరం కొర్థీ మానవుడు తయారు చేసుకుంటున్నాడు. ఆధునిక ఆలోచనలు, అవసరాలకు కావలసినవి సమకూర్చు-కోవడానికి ధనం చాలా అవసరం.

ఆధునిక సమాజంలో నివసించే మానవుడికి డబ్బు ఎంత కావాలోనన్న లెక్కను లెక్కకట్టిన వారుగాని, నిర్వచించినవారుగాని ఇంతవరకు ఎవరూలేరు. విచిత్రమేమంటే ఒక మనిషికి చనిపోయేవరకు ఎంత ధనం అవసరమో అంతవరకు మాత్రమే ఆశించటంలేదు. వారి బిడ్డలకు, మనుమడు, ముదిమనమడు! ఇలా కొన్ని తరాలకు సరిపడా సంపాదించడానికి సమాజాన్ని దోచేస్తున్నారు. శ్రమించటం లేదు. అక్రమ మార్గాల అన్వేషణలో మునిగిపోతున్నారు. మానవీయ విలువలు, నైతిక విలువలు మంటగలిపి మానవత్వం లేని మనుష్య లోకంగా సమాజాన్ని తయారుచేసారు. ఎంత ఆస్థి ఉన్నా, ధన ధాన్యాలు, వజ్రాలు, మణులు మాణిక్యాలు, మేడలు, మిద్దెలు ఇవి ఏవీ శాస్వితం కావని అవన్నీ అశాస్వితాలని వాటి వ్యామోహం నుండి బయటకు వచ్చి మనిషి మనీషిగా బ్రతకాలని - సత్యహరిశ్చంద్రీయ నాటకంలోని హరిశ్చంద్రుని పాత్ర ద్వారా మనం తెలుసుకోవచ్చు. విశ్వంభరాఖండ రాజ్యాధిపతియైన హరిశ్చంద్రుడు సర్వ రాజ్య భోగములును కోల్పోయి చివరికి కాటికాపరిగా జీవించాడు. అందువల్ల డబ్బు శాసిత్వం కాదు అని తెలుసుకోవాలి.

తిరమై సంపదలెల్ల వెంట నొకరీ తిన్ సాగిరావేరి కే
సరికేపాటు విధంచెనో విధి యవ శ్యప్రాప్య మద్దాని నె
వ్వరు దప్పించెద రున్నవాడ ననిగ ర్వం బేరికిన్ గాదు కిం
కరుడే రాజగు రాజె కింకరుడగున్ గాలాను
కూలంబుగన్

ఎంత సంపాదించినా దానిలో రవ్వంత కూడా చనిపోతూ తీసుకెళ్ళినవారు ఎవరూలేరు. ఎప్పుడు ఎవరికి ఎలా విధి రాత ఉంటుందో అది అలా జరిగి తీరుతుంది. విధి నుండి ఎవ్వరూ తప్పించుకోలేరు. ఈ రోజు లెక్కగట్టలేనంత ధనం ఉన్నవాడు రేపు బికారి కావచ్చు. నేడు బికారిగా ఉన్నవాడు రేపు అధికారి కావచ్చు, శ్రీమంతుడు కావచ్చు. ఎంత సంపాదించినా చివరి దశలో తులసి నీళ్ళు పోసేదిక్కు లేకుండా పోవచ్చు. ఇలాంటి అశాస్వితమైన సంపదలు కోసం మానవత్వాన్ని మంటగలపకూడదు.

కలికీ! ఱెక్కలురాని పిల్లలను సాకన్ గూటిలో నుంచి మే
తలకైపాటొక చెంత బెంటియొకచెం తన్ బాఱ నీలోన బి
ల్లలఁబామే గ్రసియించునో వలలపా లన్ జిక్కు
నో పున్గు లీ
యిలపై బ్రాణులకున్ వియోగమగుచో! నెవ్వారి
కెవ్వారలో!

ఈకలు కూడా రానటువంటి నెత్తుటి ముద్దలైన పిల్లలను గూటిలోనే ఉంచి, వాటికి మేతను తీసుకురావడానికి ఆడ పక్షి ఒక వైపుకు మగ పక్షి మరొక వైపుకు వెళితే ఆ పక్షులు వేటగాళ్ళు వేసిన వలలో చిక్కుకొని, వాడికి ఆహారంగా మారితే అప్పుడు పిల్లల పరిస్థితి ఏంటి? లేదా తల్లి దండ్రి పక్షులు క్షేమంగానే ఉన్నవి అనుకుంటే అవి తిరిగొచ్చేలోపు చెట్టుపైకి ఏపామో ఎక్కి గూట్లోఉన్న పిల్లల్ని తినేస్తే అప్పుడు తల్లి పక్షుల ప్రేమామృతాన్ని స్వీకరించేదెవరు.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# చింతామణి నాటకం - స్త్రీలోలత్వం

- డా॥ గరికపాటి బాలబాబు, తెలుగు లెక్చరర్, ఎస్.జి.వి. ఓరియంటల్ కళాశాల, తిమ్మసముద్రం, ప్రకాశం జిల్లా.

ప్రకృతిలో జీవించే జీవరాశుల్లో అత్యంత గొప్ప జీవరాశి మానవుడని, మానవులే నిర్ణయించుకొని జీవిస్తున్న సమాజం ఇది. ఈ మాట వాస్తవం, ఎందుకంటే మానవుడికి ఉన్న మేథస్సు, జ్ఞాపకశక్తి మరియు మాట్లాడగలగటం, ఇవే ప్రధాన కారణాలు. ఈ లక్షణాలు ఇతర జీవులకు లేకపోవటం వల్లనే మానవులు ఈ భూమి మీద గొప్పవాళ్ళు అయ్యారు. మానవుడు గొప్పవాడు ఎప్పుడు అవుతాడు అంటే! పై మూడు లక్షణాలు ఉన్నంత మాత్రాన గొప్పవాడు కాడు. మానవత్వం ఉన్నప్పుడు మాత్రమే గొప్పవాడు అవుతాడు. ఇతర "జీవరాశులకు హాని చేయకుండా జీవించటమే మానవత్వం". ఇది అసాధ్యం. ఇతర జీవులకు హాని చేయకుండా జీవించుట కష్టం! కాని, కనీసం మానవులకు హాని చేయకుండా జీవించటం కూడా మానవునికి సాధ్యపడుటలేదు. అందరం మానవులమే - మానవత్వం లేని మానవులం.

మానవులు అన్న పదంలో పురుషుల-స్త్రీలు ఇద్దరూ ఉన్నారు. మనుషుల్లో మానవత్వం నశించడానికి ఇద్దరూ కారకులే. మానవులు చనిపోయే వరకు అనేక విషయాలతో సంబంధం ఉంటుంది. అనేక విషయాల్లో "నీతి, నియమాలు" పాటించక పోయినా, కనీసం "స్త్రీ, పురుష" సంబంధాల్లో అయినా 'నీతి నియమాలు' పాటించాలి. ఇది కూడా మానవత్వమే. స్త్రీ, పురుష బంధాలు - సత్సంబంధాలుగా లేనప్పుడు సమాజం నాశనం అవుతుంది. స్త్రీ, పురుషులిద్దరూ యుక్త వయుస్సుకి వచ్చినప్పటి నుండి వారి ప్రవర్తనా నియమావళిని బట్టే సంఘ నిర్మాణం ఆధారపడి ఉంటుంది. స్త్రీ పురుషుల సంబంధాలను ఆశ్రయించుకుని కుటుంబ వ్యవస్థ బలోపేతం అవుతుంది. కుటుంబ వ్యవస్థ పవిత్రంగా ఉన్నప్పుడు మంచి సమాజం నిర్మితమవుతుంది. ఇది మానవ జీవనానికి శ్రేయస్కరం.

కుటుంబ వ్యవస్థ శిథిలమవ్వడానికి ప్రధాన కారణం, పురుషునిలో ఉండే "స్త్రీలోల త్వం". స్త్రీలోలత్వం వలన పురుషుడు ఎన్ని నీచమైన పనులు చేస్తాడో, ఏవిధంగా భ్రష్టుపట్టి పోతాడో! కుటుంబాలు ఏవిధంగా పతనమై పోతాయో అన్న విషయాన్ని "**కీ.శే. కాళ్ళకూరి నారాయణరావుగారు, చింతామణి నాటకం**" ద్వారా సమాజానికి కళ్ళకు కట్టినట్లుగా చూయిం చారు. చింతామణి నాటకంలో "**బిల్వమంగుళుడు, భవానిశంకరుడు, సుబ్బిశెట్టి, చింతామణి**" పాత్రలు ద్వారా స్త్రీలోలత్వం అంటే ఏమిటో దానివలన మనిషి కీర్తి ప్రతిష్టలు, పాండిత్యం, పరువు మర్యాదలు, ప్రేమానురాగాలు, సిరి సంపదలు, అంతరించి పోయి, కుటుంబ సంబంధాలు నాశనమై పోయి చివరకు ప్రాణాలు కూడా పణంగా పెట్టే సందర్భాన్ని దృశ్యరూపంగా 'కాళ్ళకూరి నారాయణరావుగారు ఈ సమాజానికి అందించారు.

ఈనాటకంలో వైశ్యకులానికి చెందిన సుబ్బిశెట్టి స్త్రీలోలుడై జీవిస్తాడు. వేశ్యల పట్ల వ్యామోహం పెంచుకుని, తండ్రి సంపాదించిన ఆస్తులను పోగొట్టుకుంటాడు. తను చేస్తున్న వ్యాపారాలు అన్నీ దివాళా తీస్తాయి. కిరాణా షాపులో ఉండే ఖరీదైన వస్తువుల్ని వేశ్యలకు పంపిస్తాడు. తండ్రి ఎంత చెప్పినా ఆలకించడు. చూడడానికి నల్లగా, అందవికారంగా ఉంటాడు. చింతామణి అనే వేశ్య రూపానికి రంభలా ఉండేసరికి, ఆమె స్పర్శతగిలితే చాలు జన్మ ధన్యం అవుతుందనుకుంటాడు. చింతామణి అతన్ని కూర్చోండి కొంచెం అత్తరు రాస్తాను అని బుగ్గపట్టి లాగుతుంది.

**సుబ్బిశెట్టి** : "వహ్వా! వహ్వా! యేవి సుకం, యేమిసుకం, యిన్ని
సేతులు చూశానుకాని-యీపాటి సెయ్యి కాపణ్లేలేదు.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:3(5), March:2021
Online Copy Available: www.ijmer.in

# సత్యహరిశ్చంద్ర నాటకం - భార్యాభర్తల బంధం

డా॥ జి. హరిబాబు

విశ్వంలో అనంతమైన జీవరాసుల్లో స్త్రీ లింగం, పురుష లింగం అనే భేదాలు సృష్టితోపాటే పుట్టాయి. ప్రతీ జీవరాసి, ఆయా జాతిలో ఉన్న వ్యతిరేక లింగ సంపర్కం కూడా ఆది నుండే ప్రారంభమై ఉంటుంది. ఈ సంపర్కంలో రెండు శరీరాల కలయక జరుగుతుంది. కాని కొన్ని జీవరాసుల్లో రెండు శరీరాలతోపాటు - రెండు మనసుల కలయిక కూడా జరుగుతుంది. కొన్ని ప్రాణుల్లో ఈ మనసుల కలయిక కాలం కొన్ని గంటలు లేదా కొన్ని రోజులు. మనుషుల్లో మాత్రం మనసుల కలయిక కాలం జీవిత కాలం. "దీనినే ప్రేమ అనవచ్చు". ప్రేమతో స్త్రీ, పురుషులు ఇద్దరూ తమకు తామే బంధీలవుతారు.

మానవ జాతిలో స్త్రీ, పురుషుల మనసుల కలయిక ద్వారా ఏర్పడిన 'ప్రేమను' పునీతం చేయడానికి "వివాహం అనే పవిత్రమైన సంబంధాన్ని" మానవులు సృష్టించుకున్నారు. దీని పుట్టుక కాలాన్ని సరిగ్గా అంచనా వేయలేకపోయినా, ఇది మాత్రం మానవ జీవితంలోనే అత్యంత అద్భుతమైన బంధం. వివాహ బంధం ద్వారానే కుటుంబ వ్యవస్థ ఏర్పడుతుంది. ప్రపంచ దేశాల్లోకల్లా భారతదేశంలో కుటుంబ వ్యవస్థ చాలా పవిత్రంగా, బలమైనదిగా విరాజిల్లుతుంది. దేశంలో జనాభా పెరుగుదలకు కుటుంబ వ్యవస్థ చక్కగా ఉండటం కూడా ఒక కారణం. భార్యాభర్తల పవిత్ర సంబంధంలో ఒకరికొకరు త్యాగధనులుగా జీవిస్తారు. అలాంటి త్యాగధనులు మధ్య పెరిగిన బిడ్డలు సంస్కారవంతులుగా పెరిగి సమాజానికి ఉపయోగపడి తరిస్తారు.

నేటి నవనాగరిక సమాజంలో పవిత్ర సంబంధం కాస్తా అపవిత్రంగా మారింది. త్యాగాలకు బదులు స్వార్థం మర్రిఊడలు లాగా పాతుకుపోతుంది.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:2(4), February:2021
Online Copy Available: www.ijmer.in

# జానపద సాహిత్యం - వైద్య పాటలు

జానపదుల జీవితాలతో మిళితమైన అనేక విషయాల్లో జానపద వైద్యం ఒకటి. జానపదుల సాంఘిక జీవితంలో జానపద వైద్యం ప్రముఖమైనది. "ఆరోగ్యమే మహా భాగ్యం" అన్నది పెద్దల మాట. మంచి ఆరోగ్యం కలిగి ఉండటం కన్నా, వేరొక భాగ్యం లేదు. ప్రకృతిని దైవంగా భావించే జానపదులు ప్రకృతినే వైద్యశాలగా భావిస్తారు. ప్రకృతిలో లభించే రాళ్ళు, చెట్లు, మూలికలు, సొంతంగా పండించే ధాన్యాలనే పరమౌషధాలుగా ఉపయోగిస్తారు.

"సాంఘిక ఆచారంగా, సంప్రదాయంగా, నమ్మకం ప్రధానంగా, తరతరాల నుండి వస్తున్న అనుభవ గృహ వైద్యమే జానపద వైద్యం".

జానపదులు పగలంతా కాయకష్టంచేసి సాయంత్రానికి అనేక రకాల కళాప్రదర్శనలతో ఆనందిస్తారు. అందులో భాగంగానే అనేక వైద్య విషయాలను పాటల రూపంలో పాడుతూ ప్రజలకు తెలియజేస్తారు. నేటి ఆధునిక సమాజంలో కూడా అనేక చోట్ల జానపద వైద్య విధానాలను అవలంభిస్తూనే ఉన్నారు. జానపద వైద్య విధానాల్లో కొన్ని మేలు చేసేవి, మరికొన్ని కీడు చేసేవి కూడా ఉన్నవి. జానపద సాహిత్యంలో వైద్య విషయాలను పాటల రూపంలో చెప్పటం వల్ల పిల్లలు వాటిని తొందరగా అర్థం చేసుకుంటారు. యుక్తవయస్సులో ఉన్న ఆడపిల్లలు ఆడుతూ పాడుతూ వైద్య విషయాలను పాటల రూపంలో చెప్పటం విశేషం.

ఒప్పుల కుప్ప - వయ్యారి భామ
మినప పప్పు - మెంతి పిండి
తాటి బెల్లం - తగువగు నెయ్యి
గుప్పెడుతింటే - కులుకులాడె
నడుము గట్టి - నామాట బట్టి.

ఇలాంటి పాటలు ఆడపిల్లలు పుష్పవతి అయినపుడు వారికి నడుం గట్టి పడాలని మినపపప్పు, మెంతిపిండి, తాటిబెల్లం, నెయ్యి కలిపి లడ్డులుచేసి ఆసమయంలో ఎక్కువ తినిపిస్తారు. ఇది జానపదుల నమ్మకం.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:1(2), January :2021
Online Copy Available: www.ijmer.in

# నీతి చంద్రిక – నీతి సూక్తులు

డా॥ గరికపాటి హరిబాబు
అసిస్టెంట్ ప్రొఫెసర్
యస్.జి.వి. ఓరియంటల్ కళాశాల
తిమ్మసముద్రం, ప్రకాశం జిల్లా

"విశ్వ సౌభాగ్యానికి విద్య పట్టుకొమ్మ" విలువలతో కూడిన విద్యా విధానం ద్వారా నైతిక విలువలు, మానవ సంబంధాలు, సామాజిక బాధ్యతలు బలపడతాయి. విలువలు కొరవడిన విద్యా విధానాల వల్లనే నేటి సామాజిక దుచ్చర్యలు జరుగుతున్నాయి. సనాతన ధర్మాలకు నిలయంగా, వేదభూమిగా చెప్పుకునే భారతదేశంలో స్త్రీలపై జరుగుచున్న అరాచకాలే నిలువెత్తు సాక్ష్యంగా! నేటి సామాజిక జీవన వ్యవస్థను చిత్రీకరిస్తున్నాయి. విద్య అనేది వ్యక్తి, కుటుంబం, సమాజం, ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ఉపకరించే సాధనం మాత్రమే! అన్నధోరణిలో నడుస్తుంది నేటి మానవలోకం. "విద్య అంటే!" నీతి, నిజాయితి, సత్యం, న్యాయం, ధర్మం, దయ, విచక్షణ" అను లక్ష్య లక్షణ సూత్రాలను సాధించే ఆయుధంగా భావించినపుడే "విశ్వ సౌభాగ్యానికి విద్య పట్టు కొమ్మ" అను సూక్తి పరిపుష్టి అవుతుంది.

సమాజంలో నైతిక విలువలు, మానవ సంబంధాలు నశించటానికి కారణం నేటి విద్యా విధానమే, నూతన విద్యా విధానాల వల్ల సృజానాత్మకత పెరుగుతుంది. తద్వారా నూతనావిష్కరణలు జరుగుతున్నాయి. నూతన ధోరణలు కొనసాగుతున్నాయి. నూతన జీవన విధానాలు వస్తున్నాయి. కాని నైతికత నశించిన నరసమాజం-రాక్షస సమాజం అవుతుంది. రాక్షస సమాజంలో ఆచ్చర్యాలే కాని, ఆనందాలు ఉండవు. ఆనందం లేని జీవితం వృధా, ఆనందకరమైన జీవనాన్ని అందించే సమాజం గొప్ప సమాజం అవుతుంది. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచే పాఠ్యాంశాలతోపాటు విలువలు పెంచే సూక్తులతో కూడిన పాఠ్యాంశాలను నిర్ణయించటం చాలా అవసరం.

విద్యార్థులు చెడు మార్గాల్లో పయనించడానికి ప్రధాన కారణం స్నేహం, చెడు స్నేహాలవల్ల యువత పాడైపోతున్నారు. స్నేహం ఎలాంటి వారితో చేయాలి, ఎలాంటి వారితో చేయకూడదు అనే విచక్షణ యువతకులేదు. పూర్వకాలంలో "పరవస్తు చిన్నయ సూరిగారు" రాసిన మిత్రలాభం, మిత్రభేదం, సంధి, పాఠ్యాంశాల ద్వారా జీవితానికి సరిపడా జ్ఞానాన్ని పొంది, వివేచనతో

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN: 2277-7881; IMPACT FACTOR – 6.014; IC VALUE:5.16; ISI VALUE:2.286
VOLUME 8, ISSUE 10(3), OCTOBER 2019

పత్ర సమర్పణ :
డా॥ గరికపాటి హరిబాబు
సహాయక ఆచార్యులు
యస్.జి.వి. ఓరియంటల్ కళాశాల
తిమ్మసముద్రం
ప్రకాశం జిల్లా

# చింతామణి నాటకం
# ఎంతటి వారలైన కాంతదాసులె

ప్రకృతిలో ఎన్నో జీవరాశులు ఉన్నాయి. వీటన్నింటి మధ్యా అనేక రకాల వైరుధ్యాలున్నాయి. కొన్ని చలించేవి, మరికొన్ని చలనం లేనివి ఉన్నవి. చలించే వాటిల్లో ఎక్కువ శాతం ఆడ, మగ అనే లింగభేదాన్ని కలిగి ఉన్నవి. చలనం లేని చెట్లలో కొన్నింటికి లింగభేదం ఉంది. ఉదా:– తాటి చెట్లలో, బొప్పాయి చెట్లలో ఆడచెట్లు, మగ చెట్లు ఉన్నవి. చలించే జీవుల్లో ఎక్కువ శాతం ప్రేమకు లోనుకావటం జరుగుతుంది. మన కళ్ళకెదురుగా కనిపించే జీవులు – కోడిపుంజు, పావురం, గోరింక, చిలుక ఇలా కొన్నింటిని పరిశీలించినట్లయితే యవ్వన దశకు వచ్చిన తరువాత, మగ పక్షులు దాసత్వానికి గురై వాటికి దొరికిన ఆహారాన్ని అవి తినకుండా ఆడ పక్షులకు పెడతాయి. వాటి మధ్య ప్రేమ పెరిగి ప్రక్కపక్కనే కలసి తిరుగుతూ ఉంటాయి. ఆడవాటికి మగపక్షులు గూళ్ళు కూడా కట్టిపెడతాయి.

మనుషుల మధ్య ప్రేమ మిగిలిన జీవరాశులకన్నా కొంచెం గాఢంగా ఉంటుంది. వేద కాలం నాటి నుండి, ఈనాటి వరకు స్త్రీ పురుషుల మధ్య జనించే ప్రేమలో పురుషులే ఎక్కువగా ప్రభావితులౌతున్నారు. ప్రేమికురాలు కోసం ఏకంగా దేవాలయాలను కట్టిన పురుషులున్నారు. స్త్రీల ప్రేమను పొందటంకోసం పురుషుడు ఏపని చెయ్యడానికైనా సిద్ధపడుతున్నాడు. ఈ విషయంలో వివాహితుడైనా, అవివాహితుడైనా ఒక్కటే. తొలి ప్రేమైనా మలిప్రేమైనా తేడా లేదు. "అయస్కాంతమునకు ఇనుము పరుగున వెళ్ళి అతుక్కున్నట్లుగా" – పురుషుడు కూడా స్త్రీ చెంతకు పరుగున వెళ్ళి అతుక్కొనుటకు ప్రయత్నిస్తున్నాడు.

**"ఎంతటి వారలైనా కాంత దాసులె" అన్నది జగమెరిగిన సత్యం".**

దీనికి చింతామణి నాటకం చక్కటి ఉదాహరణ. చింతామణి

# సత్యహరిశ్చంద్రీయ నాటకం – ఋణభారం

సముద్రాన్ని ఈద వచ్చుగాని – సంసారాన్ని ఈదలేము అన్నది తెలుగు సామెత. వాస్తవంగా అధ్యయనం చేస్తే " సంసార భారాన్ని మోయవచ్చుగాని ఋణ భారాన్ని మోయడం " చాలా కష్టం. భారతదేశ వ్యాప్తంగా పరిశీలిస్తే సంసారభారంతో చనిపోయినవారు లేరు. ఋణభారంతో ప్రతిరోజూ చనిపోతూనే ఉన్నారు. కొన్ని వేలమంది చనిపోయారు. భార్యా పిల్లలతో ఆనందంగా జీవించవలసిన వ్యక్తి, ఎన్ని రోగాలు వచ్చినా అనేక హాస్పటల్స్‌కి వెళ్ళి తనకున్న ఆస్తులను అన్నింటిని తెగనమ్మి ఎలాగైనా బ్రతకాలని మృత్యువుతో పోరాటం చేస్తున్న మనిషి, ఋణభారిన్ని మోయలేక బలవన్మరణం పొందడానికి సిద్ధపడుతున్నాడంటే అప్పుబాధ ఎంత భయంకరమైనదో గ్రహించవచ్చు.

అప్పు ఇచ్చిన వ్యక్తులు డబ్బు తిరిగి వసూలు చేసే క్రమంలో అప్పుబడిన వ్యక్తుల్ని కఠినంగా, హీనంగా, నీచంగా చూస్తూ, అసభ్య పదజాలంతో దూషిస్తున్నందువల్లే ఆ బాధను తట్టుకోలేక పోతున్నారని అర్థం చేసుకోవచ్చు. దీనిలో పరువు నష్టం కూడా ఉంది. పదిమందిలో పరువు పోయిందని భావించబట్టే కొన్ని సందర్భాల్లో ఋణబాధను తట్టుకోలేక కుటుంబం మొత్తం విషపు మందులు తాగి చనిపోతున్నారని భావించాలి. అప్పుల బాధతో చనిపోయేవారు మధ్యతరగతి, దిగువ మధ్య తరగతికి చెందిన ప్రజలే ఎక్కువగా ఉంటున్నారు. వీరికి ఆత్మస్థైర్యం లేకపోవటం, తిరిగి చెల్లించేత రాబడి లేకపోవటం కారణమవుతుంది.

**" మాకు రావలసిన సొమ్ము గవ్వలతో గూడ లెక్కపెట్టి మా కిప్పింపుము. నేనింక క్షణమాగను. మీ మీది మోమాటముచే నేనింకను నాలస్యము చేసినచో సహజముగా ముక్కోపియైన మా గురువుగారు నాగొంతు కొరకక మానరు హరిశ్చంద్రా! నీ పెద్దతికం బాలోచింపను. మా సొమ్ము గుమ్మరించి మతీ నడువుము ".** విశ్వామిత్రుని శిష్యుడైన నక్షత్రేశ్వరుడు హరిశ్చంద్రునిపై కనీసం గౌరవ మర్యాదలు లేకుండా మాట్లాడుతున్నాడు. హరిశ్చంద్ర చక్రవర్తి ముందు కనీసం నిలువ అర్హతలేని నక్షత్రుడు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా మాకు రావలసిన సొమ్మిచ్చి కదలమని హెచ్చరించటంతో గుండెలు పిండినట్లువుంది. అభిమానం చనిపోయి నట్లయ్యింది, ఒక సాధారణమైన వ్యక్తి చేయిపట్టి అప్పుకోసం నిలబెట్టినప్పుడు హరిశ్చంద్రుడు ఎంత దుర్భర జీవితాన్ని దర్శించి ఉంటాడో అర్థమౌతుంది.

పుట్టెడు నప్పులలోదదల ముగ్గితి వింకొక పుట్టెడైన నీ
పుట్టి మునుంగ దింతయును ప్రొద్దున నీమొగమింత సూచినన్
పుట్టద యన్నమున్ మునిగిపోక యింకేమిటి? దీపముండగా
నెట్టన జక్కబెట్టుకొన నేరకపోయె గురుండు వెఱ్ఱియై

ఓయీ హరిశ్చంద్రా! పుట్టెడు అప్పులతో పీకలుదాకా మునిగిపోయావు ఇంకొక పుట్టెడు అప్పులతో మునగడానికికైనా సిద్ధంగా ఉన్నావు. దరిద్రుడవు, ప్రొద్దున్నే నిదురలేచి నీ మోమును చూస్తే ఒక ముద్ద అన్నం కూడా దొరకదయ్యా! చూసిన వారికి కూడా దరిద్రం పడుతుంది. చూసినవాళ్ళు కూడా అప్పుల్లో మునిగిపోతారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలని మా గురువుగారు తెలుసుకోలేక పోయారు, వెర్రివాడులా ఉన్నాడు.

ఋణ గ్రస్తుడి ఎదురుగా నిలబడి, నీవు నిష్ఠ దరిద్రుడవు. నీ మోహం చూస్తే పిడికెడు కూడు కూడా దొరకదని అవమానించినప్పుడు, ఆ వ్యక్తి ప్రాణం ఉన్న శవంతో సమానం. వాస్తవంగా విశ్వామిత్రుని వద్దనుండి ఎలాంటి ధనాన్ని హరిశ్చంద్రుడు స్వీకరించలేదు. కేవలం యాజ్ఞార్థమై ధనాన్ని సమకూర్చుతానని మాట

# ఎరుకల పంచాయితీలు

- డా॥ జి. హరిబాబు,

ఎరుకల పంచాయితీలను తెలుసుకునేటప్పుడు వారి పుట్టు పూర్వోత్తరాలను కూడా తెలుసుకోవాలి. "ఎరుకల" అనేపదం 'ఎరుక' నుండి వచ్చింది. ఎరుక అంటే జ్ఞానం, భవిష్యత్ తెలిసి ఉండటం అని అర్థాలు. ఎరుకల వారు 'ఎరుక' చెబుతారు. భవిష్యత్ గురించి చెప్పడానికి ప్రకృతి పట్ల జ్ఞానం కలిగి ఉండాలి. గ్రహాల పట్ల అవగాహన ఉండాలి. ఎరుకల వారు చేసే జానపద వైద్యాన్ని, వారి వేట విధానాల్ని, ప్రకృతి పట్ల వారికున్న అపారమైన జ్ఞానాన్ని పరిశీలిస్తే నిజంగా వారు "ఎరుక" చెప్పగలరనే భావన కలుగుతుంది.

"YERUKALA" Comes from the Tamil word arital which means 'KNOWING'The name Yerukala is derived from "ERUKA" meaning "Prophesy" in Telugu. Since the women of this tribe are "Sooth Sayers" and "Fortune - tellers". (K.S. Singh : P-1982: 2003)

భారతదేశ పురాణ ఇతిహాసాలను బట్టి ఎరుకల జాతి కొన్ని వేల సంవత్సరాల పూర్వమే గుర్తించబడిందని చెప్పవచ్చు. పురాణాలను బట్టి చూస్తే శివుడు 'ఎరుకల' సాని రూపంలో వచ్చి పార్వతిని కాలుస్తాడని చెప్పబడింది.

ముక్కున బలుకెంపు ముక్కెర చలగ/ పెక్కు రత్నము పూసా పేర్లు చెన్నొంద/ శిరమున రత్న భూషిత పాత్ర బూని/ యెరుకతయె వచ్చి హిమశైలమునకు/ ఎరుకల సాని వచ్చె ఎరుకనుచు 'అను'/ ఎరుకల సాని వచ్చె నెరుకో యెరుకో యెరుకయనుచు 'ఎరు'.

# తెలుగు కథాసాహిత్యం - గిరిజన జీవన సంస్కృతి సంప్రదాయాలు

- డా॥ గరికపాటి హరిబాబు,

గిరిజనులకు కథాసాహిత్యంలో మొదటిసారిగా స్థానం కల్పించిన గౌరవం గురించి ఆలోచిస్తే - "చింతా దీక్షితులే తొలి గిరిజన కథకుడని అంటుండేవారు. కాని ఆయన కన్నా దశాబ్దంపైగా ఎంతో ముందే 'చెంచి' (భారతి, 1932) కథని గూడూరు రాజేంద్రరావు అనే రచయిత రాశాడు" అని జయధీర్ తిరుమలరావు తేల్చారు. గిరిజనుల జీవితమంటే వారి ఆలోచనా విధానం. సమస్యలు, ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు, అమాయకత్వం, గుంపు జీవన ఉత్సవాలు, వారిదైన సంస్కృతి, భాష వేషధారణ, వేట, అడవితో పెనవేసుకున్న దైనందిన జీవన వ్యవహారాలన్నీ కలిస్తే గిరిజన జీవితం అవుతుంది. ఈ జీవితాన్ని చిత్రించే ప్రయత్నం కొంతవరకు గిరిజన కథల్లో గిరిజన, గిరిజనేతర కథకులు చిత్రించారు. గిరిజనుల ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లు, పండుగలు, పబ్బాలు, ఆచార సంప్రదాయాలు, గ్రామీణ పాలన, ఆర్థిక స్థితిగతులు రాజకీయ విధానం మొదలైన వాటిని ఆదివాసుల జీవన విధానంగా చెప్పవచ్చు. అయితే గిరిజన కథకులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారు. వాళ్ళు రాసిన కథలు మొత్తం మీద ఐదో, ఆరో ఉంటాయి. కాబట్టి ఈ గిరిజన కథల్ని గిరిజన, గిరిజనేతర కథాసాహిత్యాన్నంతా కలిపి చర్చించడం జరుగుతుంది.

**1. గిరిజనుల వివాహాలు**

గిరిజనుల పెళ్ళిళ్ళు గుంపుల పద్ధతిలో జరుగుతాయి. ఒక గుంపు అమ్మాయిని మరొక గుంపు అబ్బాయి ఎత్తుకుపోతాడు. ఆ అమ్మాయితో రెండు మూడు రోజులు అడవిలో ఎవరికీ కనిపించకుండా దాక్కోవాలి. అలా అడవిలో ఒంటరిగా ఉండగలగాలి. అమ్మాయి ఒప్పుకుంటే వారిద్దరికి వివాహం జరుగుతుంది. అబ్బాయి, అమ్మాయితో పాటు భవిష్యత్తులో జీవించగలడా లేదా అనేదానికి ఇది

# భారతీయ సాహిత్యం - జానపద వైద్యం

**- డా॥ జి. హరిబాబు,**

ప్రాచీన భారతీయ సాహిత్యంలో అనేక చోట్ల జానపద వైద్యం, ప్రయోగాల గురించి చెప్పటం జరిగింది. క్రీస్తుపూర్వం 2300 సంవత్సరాల కాలంలోనే జానపద వైద్యం, ప్రయోగాలు ఉన్నట్లు కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల తెలుస్తుంది. శత్రు రాజుల నుండి తమ రాజ్యాలు దక్కించుకోవడానికి మంత్ర తంత్ర యుక్తులు ప్రయోగించటం, వాటిద్వారా క్షుద్ర దేవతలను ఉపాసించి అద్భుత శక్తుల్ని సంపాదించి శత్రువుల్ని జయించటం కనిపిస్తుంది ప్రమాదాలకు మొక్కల్ని, మూలికల్ని ఉపయోగించే విధానం ఉంది. చెట్ల సమ్మేళనం వల్ల, జంతువుల మజ్జా చూర్ణం వల్ల రోగనివారణ కలిగి అపార శక్తులు కలుగుతాయని జానపదులు నమ్ముతారు.

**భారతీయ సాహిత్యం:** ప్రాచీన భారతీయ సాహిత్యానికి చెందిన కౌటిల్యుని అర్థశాస్త్రం, సౌందర్యలహరి, మాళవికాగ్నిమిత్రం మొదలైన కావ్యాల్లో జానపద వైద్యం ప్రయోగాలు ఉన్నాయి.

**కౌటిల్యుని అర్థశాస్త్రం:** కౌటిల్యుని అర్థశాస్త్రంలో భైషజ్యా మంత్ర యోగం, స్వబలోపఘాత ప్రతీకారం, అద్భుతోత్పాదనం, పర్బలఘాత ప్రయోగాలు గురించి చెప్పబడింది. ఇవి అన్నీ శత్రువుల్ని జయించటం కోసం చేసే మోసపూరిత క్రియలు. కానీ రాజ్యాన్ని ఏవిధంగానైనా దక్కించుకోవడం ప్రధానం కనుక ఇవి న్యాయసమ్మతమైనవి.



**భైషజ్యా మంత్ర యోగం:** ఒక ఉసిరికాయ, అడవిపంది కన్ను, మిణుగురు పురుగు, నల్ల శారివ వీటన్నింటిని చూర్ణంచేసి కళ్ళకు పూసుకుంటే రాత్రుల్లో కూడా రూపాలను చూడవచ్చు.

మూడు రాత్రులు ఉపవాసం చేసి పుష్యమి నాడు కుక్క, పిల్లి, గుడ్లగూబ, ఎగిరే నక్క మొదలైన జంతువుల కనుగుడ్లను వేరువేరుగా చూర్ణంచేసి, కుడి కళ్ళ చూర్ణాన్ని కుడి కళ్ళకు, ఎడమ కళ్ళ చూర్ణాన్ని ఎడమ కళ్ళకు కాటుకలా పెట్టుకుంటే ఆ వ్యక్తి నీడగాని, రూపంగానీ ఇతరులకు కనిపించదట.

స్త్రీకానీ, పురుషుడు కానీ మట్టిలో శ్వాస వదిలిన తర్వాత ఆ మట్టిని నీటి పాము చర్మంలో నింపితే ఆయా వ్యక్తుల ముక్కు, నోటి శ్వాస ఆడకుండా బంధించవచ్చు.

మూడు రాత్రులు ఉపవాసం చేసి పుష్యమి నక్షత్ర యుక్త మగు బహుళ చతుర్దశి నాడు స్వీయ పాకం చేసిన స్త్రీ హస్తము నుండి బిల భావక లేఖనములను కొనవలెను. వాటిని మినుములతో ఒక గంపలో పెట్టి స్మశానంలో పాతిపెట్టాలి. తరువాత చతుర్దశినాడు దాన్ని పైకి తీసి పెళ్లికాని కన్య చేత చూర్ణం చేయించి మాత్రలు చేయాలి. కింది చెప్పిన మంత్రాలను ఉచ్చరిస్తూ ఆ మాత్రలు ఎక్కడ వేస్తే అక్కడ ప్రజలంతా నిద్రలో మునిగిపోతారు.

**మంత్రాలు:** విరోచనుని కుమారుడగు బలిని, శతమాయుడగు శంబరుని, బంధీర పాకుని, నరకుని, నికుంభుని, కుంభుని, నేను నమస్కరిస్తున్నాను. దేవలుని, నారదుని నమస్కరిస్తున్నాను. వీరి ప్రక్రియల సాధనమున వీరు నిద్రమత్తు చెందిరి. అజిగరములు చమూబలములు ఎలా నిద్రిస్తున్నాయో అలాగే పురుషులు నిద్రించేదరు గాక. గ్రామవాసులందరూ నిద్రించేదరు గాక.

మూడు రాత్రులు ఉపవాసం చేసి పుష్యమి నాడు ఇరవై ఒక్క గులకరాళ్ళను నేతితో, తేనెతో హెూమం చేయాలి. ఆ రాళ్లను గంధమాల్యాలతో పూజించి పూడ్చేయాలి. మరునటి పుష్యమి నాడు రాళ్లను పైకి తీసి కింది చెప్పిన మంత్రాలను ఉచ్చరించాలి. ఒక్కొక్క రాయితో తలుపును కొట్టాలి. నాలుగు రాళ్లతో కొట్టిన వెంటనే తలుపులు తెరుచుకుంటాయి.

**మంత్రాలు:** నేను, అగ్ని దేవతలు దశదిశలు వీని శరణము గావించు చున్నాము. అన్నియు వెళ్లి పోవు గాక అన్ని నాకు వశమగుగాక స్వాగతం.

# సాహిత్యం - జానపద వైద్యం

- డా॥ జి. హరిబాబు,

ప్రపంచంలోని అనేక భాషా సాహిత్యాలల్లో వైద్యం గురించి చెప్పబడింది. సాహిత్యం అంటే సాధారణంగా రసప్రధానమైందిగా చాలామంది భావిస్తారు. సాహిత్యం అంటే సకల శాస్త్ర విషయాలతో కూడుకొన్నదిగా భావించాలి. " హితేన సహితం సాహిత్యమ్ ", అన్నారు. అనగా హితంతో కూడుకున్నది, హితాన్ని చేకూర్చేది అని దీని అర్థం. మేలు చేసేదిగా సాహిత్యాన్ని అభివర్ణించారు. సమాజానికి మేలు చేసేది, సమాజం అంటే మనుషులకు, అనగా భూగోళం మీద ఉండే ఏప్రజలకైనా మేలు చేస్తుందని అర్థం. ఈ భూమి మీద నివసించు ప్రజలకు అత్యంత మేలైనది, ప్రధానమైందే వైద్యం. సాహిత్యంలో భాగంగా పుట్టు కొచ్చింది జానపద వైద్యం అనేక భాషల్లో, అనేక సాహిత్య ప్రక్రియల్లో జానపద వైద్యం కనిపిస్తుంది.

మానవుడు జానపదుడుగా జీవించిన కాలంలో లాభమైనా, నష్టమైనా జానపద వైద్య విధానాలనే అవలంభించేవాడు. ఈ జానపద వైద్యం గురించి పాటలుగానూ, కథలుగానూ, సామెతలుగానూ, పొడుపు కథలుగానూ, సాహిత్యంలో సాహిత్యవేత్తలు ప్రస్తావించారు.

**శ్రీకాళహస్తి మహాత్మ్యం :-** ధూర్జటి రాసిన శ్రీకాళహస్తి మహాత్మ్యంలో తిన్నడు అడవిలో ఉన్న శివలింగానికి పూజలు చేస్తుంటాడు. నిష్కల్మషమైన మనస్సుతో శివారాధన చేస్తూ తనకు లభించిన మాంసాహారాలతోనే నైవేద్యం పెడతాడు. శివలింగం కంటి నుండి నీరు కారుతుండగా ఆవేదన చెంది వైద్యంచేసి, భక్తిని ప్రదర్శిస్తాడు.



సీసం॥ కోక పొట్లం బావిగొన నుడి యొత్తుచున్
        గషణోష్ణ కరభ భాగమున గాచి
    నెత్తి దంగేడాకు యెత్తి రేచకి నిమ్మ
        వంటి పుల్సున నూతి పట్టుపెట్టి
    తెల్లని దింటెన పువ్వుదెచ్చి తద్రసమిడి
        కలివెపువ్వులు గోసినలచి పిడిచి
    వేరిన నెయ్యి పెట్టి పెరుగు వత్తులు వైచి
        చనుబాలతో రాచి సంకుచమిరి

తేట॥ విన్న మందులు తాసరి కన్నమందు
    లడిగి తెచ్చిన మందులు నడవియందు
    లెన్ని చేసిన మానకయిందు మౌళి
    కన్నతొడి బడి నెత్తురు గాఱుటయున్

తిన్నడు బట్టను మడిచి నోటిగాలితో వేడిచేసి కంటికి ఆవిరి పెడతాడు, చేతులు రాపిడి చేసి వేడి పుట్టించి కంటికి అద్దుతాడు. తలమీద తంగేడు ఆకు రసమును పట్టిస్తాడు. కరక్కాయను నిమ్మపండు రసంతో నూరి మందంగా పూస్తాడు. తెల్ల దింటెన పువ్వు పసరు కంటిలో పిండుతాడు, కవిలె పువ్వుల పసరు కంటిలో పిండుతాడు, పేరిన నెయ్యి పట్టి, పెరుగులో ముంచిన దీపపు వత్తుల వంటి గుడ్డ పీలికలను కంటిపై భాగంలో అంటిస్తాడు. విన్నటువంటి మందులు, తనకు స్వయంగా తెలిసిన మందులు, ఇతరులను అడిగి తెలుసుకున్న మందులు వాడతాడు. కంటి జబ్బులకు పైన పేర్కొన్న మందులను గ్రామాల్లో అనేకమంది వాడుతుంటారు.

వివిధ రోగాలకు మాంసాహారాలు ఉపయోగ పడతాయని జానపద వైద్యంలో చెప్పబడింది. కొన్ని రకాల జంతువుల, పక్షుల మాంసం తింటే కొన్ని రోగాలు తగ్గుతాయని జానపదులు నమ్మకం.

Pigeon curry is prescribed for paralysis, camarukaki (జెముడు కాకి) curry for epilepsy, House sparrow curry for im-